


* నిద్రకు వెలియై....
  నే నొంటరినై ....
  నా గదిలోపలి చీకటిలో .
  చీకటిలోపలి నా గదిలో....
  నా గదిలో...
  చీకటిలో. ..

శ్రీశ్రీగారు ఈ గేయాన్ని వ్రాసి చాలా కాలమయింది. కాని నా కోసమే వ్రాసారా అనిపిస్తోందిప్పుడు. భరించలేని వంటరితనం నన్ను కబళిస్తోంది. వేయి అమావాస్యల అంధ

శ్రీపాద రామసోమయాజులు

కారాన్ని ఒకేసారి నిండించే కరాళ కాళరాత్రి లాటి వంటరితనం....కాన్సర్ లా వంటరితనం. నిలువునా నన్ను దహించివేసే మారణహోమం లాటి వంటరితనం....అన్నీవుండీ ఏదీలేకుండా చేసే వంటరితనం....!

ఎత్తయిన కొండశిఖరం. అక్కడకు ఎలా చేరానో తెలియదు. ఆలోచిస్తూ, అపస్మారకంగా నిలుచున్న నన్ను వెనుకనుండి హటాత్తుగా ఎవరో నెట్టేసే, గాలిలో గిరికీలుకొడ్తూ, ఊపిరాడక కొట్టుకుంటూ, లోయమట్టాన్ని చేరుకుంటూన్న భావన తినేస్తోంది నన్ను. తెలియని అలజడి, ఏదో ఆందోళనా నాలో రేగుతున్నాయి. వ్యక్తం చేయలేని భయం నన్ను ఆవరిస్తూవుంది. వళ్ళంతా చెమటతో తడిసి తెలివి వస్తుంది. నేను అనుభవిస్తున్న నరకం వర్ణనాతీతం.

పారిపోవాలి .... భయంకరమయిన యీ వంటరితనానికి దూరంగా. . శాంతమయమైన చోటుకు పారిపోవాలి.. వాత్సల్యం పొంగి, అనురాగంతో అందనిచ్చే చోటుకు పారిపోవాలి. ఆప్యాయంగా, నా తల నిమురుతూ, "అలసిపోయావా కన్నా! కళ్ళు మూసుకుని అలాగే వుండు. నిద్రవస్తుంది" అంటూ సుతారంగా అమ్మ నా కణతల నదుముతూవుంటే, అన్నిటినీ మర్చిపోయి, సేదతీరి నిదుర పోవడానికి అమ్మ వడిలాటి వడి దొరికే చోటుకు పారిపోవాలి....


అమ్మ!... నన్ను వదలి, వంటరివాణ్నిచేసి, ఆమె తప్ప ఇంకెవరూలేని నన్ను వదలి. . వెళ్ళిపోయింది. భరించలేని ఈ వంటరితనానికి నన్ను వప్పగించి, వెళ్ళిపోయింది మన శ్శాంతిని దూరంచేసే శూన్యానికి నన్ను దగ్గర చేసి, తాను వెళ్ళిపోయింది. చీకూ చింతా లేకుండా, నిరంతరం తన నీడలో బ్రతికే నన్ను వంతల పాల్జేసి, నిర్దయగా వెళ్ళిపోయింది అమ్మ. . నరాలు పగిలి పిచ్చెక్కిపోతానేమో అన్నంత భయంకరమయిన ఆలోచనలతో వేడెక్కిపోయే నా మస్తిష్కానికి సేదనిచ్చే తన వడిని నాకు దూరంచేసి వెళ్ళిపోయింది .. అమ్మ....

నిజంగావెళ్ళిపోయిందా! ఎలావెళ్ళిపోతుంది? నాలోనేవుంది. నేనే తాను! తానే నేను!.. ఆమె రక్తం నాలో ప్రవహిస్తోంది. నా ఆలనాపాలనా తానే అయి పెద్దవాణ్ణి చేసింది. తన ఆలోచనలను నావిగా తీర్చిదిద్దింది. అమ్మపరంగా ఆలోచించడం నేర్చుకున్న నాకు అమ్మ దూరమయిందా! అమ్మ నాకు దూరం అయింది అనుకోవడం నా భ్రమ. ఆమె అభిప్రాయాలూ, అభిరుచులూ నావి. నా ఇష్టాయిష్టాలు ఆమె దగ్గరనుండి తెచ్చుకున్నవే! ఆమె అనుభూతులూ, అనుభవాలు నావిగా మారుతున్న సమయంలో ఆమె 'నాకు దూరం అయింది' అని అనుకోవడం భ్రమ కాక మరేమటి? ఆమె కోసమే, ఆమే నేనై జీవిస్తున్న నాకు అమ్మ దూరమెలా అవుతుంది.

నాకు మూడేళ్ళ వయసులో తండ్రి పోయాడట. అప్పటినుండీ తానే సర్వస్వమై పెంచింది అమ్మ. నన్నొదిలి ఒక్క క్షణం ఉండేదికాదు. మిగతా అందరిపిల్లలలాగ బయటకువెళ్ళి ఆడుకోవడం నాకు తెలియదు. అమ్మతోనే నా ఆటలు ....అమ్మవే నా పాటలు....స్కూలువదలగానే తిన్నగా ఇల్లు చేరిన నాకు అమ్మ తోడిదే లోకం. అమ్మ నాతోడు... నా నీడ! 'వాడు అమ్మ కొంగు వదలడురా! వఠి గూట్లో పక్షి. మనతో ఆడడానికి రమ్మన్నా రాడు. అమ్మ కూచి.' కొందరు వెక్కిరించేవారు. ఎందుకో తెలియదుగాని, నాకు ఏడుపువచ్చేది. అమ్మ వడిలో తలదాచేసుకున్న మరుక్షణం ఎవరేమనుకున్నదీ మరచి పోయేవాణ్ణి.

"మగ పిల్లవాడు . ఎప్పుడూ మీ కొంగట్టుకు కూర్చుంటే వాడికి లోకం ఏమిటో ఏం తెలుస్తుంది? అలా బయటకు తిరిగి రమ్మను." ఎప్పుడయినా మా ఇంటికి వచ్చే పిన్నిగారు అమ్మకు సలహా ఇచ్చేది.

"నా తోడిదే వాడి లోకం. ఏరా కన్నా?" అంటూ తల నిమిరి నన్ను దగ్గరగా తీసుకునేది అమ్మ. విహార యాత్రలని,సినీమాలని స్కూల్లో ప్రోగ్రాంలువేసినా, నేను వెళ్లేవాడిని కాను.. అమ్మరాదు కనుక.




అన్ని విధాలా అమ్మమీదే ఆధారపడుతూ కాలేజీలో చేరినా; నా దైనందిన చర్యలో పెద్ద మార్పురాలేదు. పుస్తకాల పురుగని, ఇంటి గూటి పక్షని, అమ్మ కూచని ఎన్నో నామ కరణాలు జరిగాయి నాకు. పనిగట్టుకువచ్చి మరీ ఎద్దేవా చేసేవారు తోటి కుర్రాళ్లు. నేను లక్ష్య పెట్టక పోవడంచూసి, విసుగెత్తి తాత్కాలి కంగా వూరుకునేవారు. ప్రతి విషయంలోనూ అమ్మ సలహా తీసుకునేవాడిని. నిజానికి అమ్మ చెప్పిందే చేసేవాడిని. ఆమె అన్నదానికి వ్యతి రేకంగా చేద్దాం అన్న ఆలోచన సహితం వచ్చేది కాదు. నా జీవితం అంతా అమ్మ మయ మైంది. ఏం జేసినా అమ్మకోసమే! ఆమె ఆనందంగా వుండాలనే! అసలు నేను నేనుగా చేసిందేమీలేదు. అంతా నాలోని అమ్మ చేయించేది.

"ఏ గ్రూపు తీసుకుంటున్నావు?" కాలేజీలో చేరే ముందు నేను తీసుకోబోయే గ్రూపు వివ రాలు అడిగారు కొందరు. "ఏమో! మా అమ్మ ఏ గ్రూపు తీసుకోమంటే అదే తీసు కుంటాను."

"పిచ్చివాడు! ప్రతీది అమ్మ చెప్పాలి. ముమ్ముందు వీడెలా బ్రతుకుతాడో!" వాళ్లు చూపించే సానుభూతికి నాకు నవ్వు వచ్చేది.

"నీకు సైన్సు గ్రూపువద్దురా కన్నా! ప్రాక్టి కల్సూ అవీవుంటాయి. నువ్వు తట్టుకోలేవు. ఆర్ట్సయితే కాలేజీ అయిన తర్వాత ఇంటి దగ్గరే చదువుకోవచ్చు." అమ్మకు అన్నీ తెలుసు. ఎంత తెలియకపోతే నాన్నగారు పోయిందగర నుండి పొలం వ్యవహారాలు, ఇంటి వ్యవ హారాలు ఒంటిచేత్తో నడిపిస్తూ వచ్చింది! నన్ను దగర కూర్చోబెట్టుకుని చదివించడం, నా సందే హాలను తీరుస్తూ, సలహాలనిస్తూ, స్కూలు ఫైనలులో మంచి మార్కులు వచ్చేట్టుచేసింది అమ్మ. నా గురించి నా కంటే అమ్మకే ఎక్కువ తెలుసు. కాలేజీనుండి తిన్నగా ఇంటికివచ్చి అమ్మతో కాలఁ గడిపేవాణ్ణి. నేను చదువు కుంటున్నంతసేపూ అమ్మకూడ తోడుగా కూర్చునేది.

నన్నంతా ఎద్దేవాచేసి, ఆటపట్టించినా,— బాగా చదువుకోవడంవలన "కుర్రాడు బుద్ధి మంతుడు. మంచి మార్కులు సంపాదిస్తాడు" అన్న బిరుదులుకూడ ఇచ్చారు. లెక్చెరర్సంతా అభిమానంగా చూసుకునేవారు. కాలేజీకి మంచి పేరు తెస్తానని అనేవారు.

అలాగే........వాళ్ళనుకున్నట్టుగానే, నాకు మంచి మార్కులువచ్చాయి. అమ్మ శ్రమకు ఫలితం నేనందుకున్నాను. అమ్మ ఆదేశం ప్రకారం యూనివర్సిటీలో చేరాను. ఇంగ్లీషు లిటరేచరు బాగా ఆకర్షించింది. షేక్స్పియరు డ్రామాలలో, కామెడీల కంటె ట్రాజడీలు చాల ఇష్టంగా చదివేవాడిని. ఒథెల్లో, హేమ్లెట్, మెక్బెత్....ఇవి ఎన్నిసార్లు చదివినా ఇంకా చదవాలనే వుండేది. ఇంగ్లీషు సాహిత్యంలో ఎంత మంచి పేరు సంపాదించినా బైరన్ అంటే నాకు పడేదికాదు. అతని వ్యక్తిగత జీవితం అందుకు కారణం. తల్లిపట్ల అతను ప్రదర్శించిన నిరసన....తల్లితో అతను ప్రవ రించిన తీరు...కారణాలు. తప్పదు గనుక చదివేవాడిని. 'పేరడైస్ లాస్ట్ చదువుతూంటే ప్రతీ రాత్రి ఒక దేవకన్య సాక్షాత్కరిస్తున్నట్టు వుంటుంది' అనేవాడు ఆచారి. నాకు మట్టుకు అదంతా మిల్టన్ కల్పించిన అభూత కల్పనగా తోచేది.

షేక్స్పియర్ వ్రాసిన ట్రాజడీలంటే అమ్మ చెవి కోసుకునేది. బహుశ అందుకే అవి నాకు కూడ అంత ఇష్టమయాయనుకుంటాను. లేడీ మేక్బెత్ ధైర్యాన్ని, కాషియస్ నేర్పరితనాన్ని, ఒథెల్లోలోని ఆకాంక్షనూ పొగిడే అమ్మకు హేమ్లెట్ 'టు బి ఆర్ నాట్ బి' అన్న వరస నచ్చేదికాదు.

పరీక్షరోజుల్లో మేడమీద నా గదిలో పడుకు నుండే నన్ను అమ్మ లేపేది. టీ తయారు చేసి యిచ్చి. చదువుకోమనేది. నా ప్రక్కనే తనూ ఓపికగా కూర్చునేది. ఒక్కొక్కసారి నాకు తెలివి వచ్చేసరికి క్రింద అమ్మ గదిలో అమ్మ ప్రక్కలో వుండేవాడిని. రాత్రి చదు వుతూ, చదువుతూ ఎప్పుడో అమ్మ దగ్గరకొచ్చి పడుకునుంటాను. విసుగుకోకుండా, నిర్వి రామంగా అమ్మపడ్డ కష్టం, నేను చేసిన కృషి వృధాకాలేదు. ఎమ్.ఎ.లో ఫస్టు క్లాసు వచ్చింది. ఆ ఫస్టు క్లాసు తనదే అన్నంతగా ఆనంద పడింది అమ్మ. నిజానికి ఆఫస్టు క్లాసు ఆమెదే అన్నది నా భావన.

రిసెర్చి చేయమన్నారు శ్రేయోభిలాషులు. రిసెర్చి అయితే ఎక్కువకాలం లైబ్రరీలో గడపాలి. థీసిస్ వ్రాయడానికి చాలకాలం పడు తుంది. అంటే అమ్మ వంటరిగా ఎక్కువ కాలం గడపాలి. ఆ విషయమే అమ్మతో అంటే

"నా కన్నకు నేనంటే ఎంత అభిమానం! అవునుగాని కన్నా! నన్నొదిలి నీ వుండలేవా? నిన్నొదిలి నేనుండలేనా? నిజం చెప్పూ!" అంటూ నవ్వేసింది. నిజమే! అమ్మను వదలి నేనే వుండలేను.

అందుకే పూర్లోనేవున్న కాలేజీలో ఖాళీ వుందని తెలిసి అప్లయిచేసాను. కళ్ళకద్దుకుని తీసుకున్నారు. లెక్చెరర్‌గా కుదిరాను. విద్యార్థు లకు నేను చెప్పే తీరు నచ్చిందనుకుంటాను, నేను చెప్పే పాఠాలు శ్రద్ధగా వినేవారు. నన్ను గౌరవంగా చూసేవారు. చిక్కంతా తోటి లెక్చె రర్సుతోనే. నా బ్రతుకు నేను బ్రతకడం వాళ్ళకు కష్టంగా వుంటుంది. ఎవరితోనూ మాట్లాడనని ఏ విషయమూ పట్టించుకోనని,క్లాసులో పాఠాలు తప్పించి ఏ ఇతర అభిరుచి లేని వాణ్ణని...నా ఎదురుగానే ఎద్దేవా చేసేవారు. 'కర్మసన్యాసి' అనేవారు. వాళ్ళందరికీ నా సమాధానం ఒక చిరునవ్వు.

ఒకరోజు సాయంత్రం "కన్నా! గుర్నాధం గారని బాగా సాంప్రదాయ కుటుంబీకులు.... అమ్మాయి బియ్యే పాసయిందట.. అందంగా వుంటుందట. బాగా కలిగిన వారట. అయినా వారికున్నా లేకున్న మన కిబ్బంది లేదనుకో.. అమ్మాయిని చూసుకుందుకు రమ్మని కబు రంపారు....చూస్తావుట్రా!" నేనే మంటానో అన్నట్టు చూసింది అమ్మ. పెళ్ళి........దీన్ని గురించి అంతవరకు నేను ఆలోచించలేదు. నేనూ అమ్మా కాక మూడవ వ్యక్తి ఈ కుటుం బంలోకి! చదువుకున్నదట. ....అందంగా వుంటుందట...

అందం, డబ్బూ....ఇవి కావు సమస్య. వచ్చే వ్యక్తి అమ్మను అర్థం చేసుకునే దయి వుండాలి. అమ్మకు అనుగుణంగా వుండాలి. అమ్మకు వ్యతిరేకంగా నడిచే వ్యక్తిని నేను

సహించలేను. అమ్మను ఏ విధంగాను కష్టపెట్ట కుండా, అన్నివిధాల ఆమె సంతోషానికి సానుకూలమయిన అమ్మాయి కావాలి.... నాకూ అమ్మకూ నడుమ గోడ అయి కూర్చునే వ్యక్తిని నేను గౌరవించలేను. అటువంటి వ్యక్తిత్వాన్ని హర్షించనూలేను. ఉబలాటపడు తున్న అమ్మను నిరుత్సాహపరచడం ఇష్టంలేక "నీవెలా అంటే అలాగే" అన్నాను.

పెళ్ళిచూపుల రోజు, ఒక్క చూపుతోనే ఒక నిశ్చయానికి వచ్చాను. నేను వివాహ మాడే అమ్మాయిలో మా అమ్మను చూడ గలగాలి. అపుడుగాని ఆ వ్యక్తి మా ఇంటి కోడలు కాలేదు.

అమ్మాయి చూడడానికి చాల బాగుంది. దృఢత్వాన్ని సూచించే ఆ గడ్డపుతీరూ, ఆత్మ విశ్వాసాన్ని వ్యక్తపరచే ఆ కండ్లూ నాలో సంచలనాన్ని రేపాయి. క్లియోపాత్ర గుర్తుకు వచ్చింది. అమ్మాయికీ, అమ్మకూ సరిపడదు. అమ్మ చెప్పిన ప్రతిమాట ఈ అమ్మాయి వింటుందని కాని, ఆమె చెప్పిన ప్రతి పని చేస్తుందనిగాని నాకు అనిపించలేదు. అటు వంటపుడు ఘర్షణతప్పదు. కోరికోరి నరకాన్ని ఇంటికి చేరవేయడం అవివేకం! అమ్మకు ఆనాందాన్నివ్వలేని అమ్మాయి నాకేనాడూ ఆనందాన్నివ్వలేదు.

ఇంటికి తిరిగి వచ్చాక "ఎలా వుందిరా అమ్మాయి?" అమ్మ కంఠంలో ఆతృత, తొంగిచూసే ఆందోళన పసిగట్టాను.

"బాగానే వుంది" అమ్మ ముఖంలోకి చూసాను. వెలవెలబోతూ వుంది.

"కాని ఆ అమ్మాయిని నేను చేసుకోలే నమ్మా." అమ్మ కళ్ళలో ఆనందం.

"హాయిగా బ్రతుకుతున్న మన మధ్యకు ఇంకొక మనిషి ఎందుకమ్మా? ఇప్పట్లో నా పెళ్ళి విషయం తలపెట్టకు" అమ్మ నిట్టూర్పులో కొండంత బరువు దిగింది. అమ్మ ఆనందమే నా ఆనందం. ఆమె అనుభూతులే నా అనుభూతులు. ఆమె ఆశయాలు నావి. నేనే ఆమె. అమ్మే నేను. అటువంటి అమ్మ హటాత్తుగా నన్నొదిలి వెళ్ళిపోయింది....గుండె ఆగిపోయింది....నా గుండెల్లో చితి రగిల్చి వెళ్ళిపోయింది.

కాని ఆమె హృదయస్పందనను నా గుండెల్లో మిగిల్చి పోయింది. లోకం దృష్టిలో నే నేకాకినే కావచ్చు. కాని నాలోని నా అమ్మ బ్రతికేవుంది. "నే నెక్కడికీ పోలేదురా కన్నా! నీలోనే వున్నాను. నీ ఊపిరి నేనే" వెర్రివాణ్ణి! నాలోని అమ్మను గుర్తింపలేక ఎంతగా ఏడ్చాను!

* * *

పరామర్శ చేయడానికి ఇరుగు పొరుగువారు కాలేజీనుండి.. .చాలమంది వచ్చారు. ఎవరికి తోచిన అనునయ వాక్యాలు వారుచెప్పి తమ సానుభూతిని వ్యక్తపరుస్తున్నారు. నాలోని అమ్మను నేను చూసుకుంటూంటే నా చూపులకు అర్థాలు కల్పిస్తున్నారు. నా కండ్ల వెంబడి నీరు రాకపోవడం వారికి ఆశ్చర్యం కలిగించింది. "అమితమైన దుఃఖంలో కండ్లనీళ్ళు యెండిపోతాయి" ఒకాయన విశదపరుస్తున్నాడు. పిచ్చి వాళ్ళు. వాళ్ళకు తెలియదు. అమ్మ నాలోనే ఉంది. ఇంక నాకు దుఃఖం ఎందుకు?

"ఇలా ఎంతకాలం విచారిస్తూ కూర్చుంటే వెళ్ళిపోయిన మీ అమ్మగారు తిరిగి వస్తారా మాష్టారూ?" నాదస్వరం విన్నపాములా తల ఎత్తాను. ఎదురుగా అరవింద. మా డిపార్టు మెంటులో నా తర్వాత చేరింది.

"చిన్నప్పటినుండీ మిమ్మల్ని సాకుతూ ఇంతటివాణ్ని చేసారు. ప్రయోజకుడిగా తీర్చి దిద్దారు. మీచేతుల మీదుగా వెళ్ళిపోయారు. ఆవిడ జ్ఞాపకాలలో బ్రతకాలిగాని ఇలా నిస్పృహగావుంటే ఆవిడ సంతోషిస్తుందనుకున్నారా?" అనునయంగా ఆమె పలికినతీరు, ఆమె మాటల్లోని భావం నన్ను ఆకట్టుకున్నాయి. ఆ కళ్ళలోని ఆప్యాయత, ఆమె కంఠంలో పెల్లుబికే వాత్సల్యం నన్ను కదిల్చివేసాయి .... అమ్మ అచ్చం యిలాగే మాట్లాడివుండేది అన్నదే భావన.

"వంటరిగా ఇంటి దగ్గరేవుంటే యిలాగే వుంటుంది. లేవండి మాష్టారూ! అలా మా

ఇంటివరకూ వెళ్ళివద్దాం." కాదనలేకపోయాను. మంత్రం వేసినట్టు వెనక నడిపించుకు తీసుకెళ్ళిపోయింది అరవింద.

ఆమె ఇంట్లో అందరూ ఆప్యాయతను అందజేసారు. అరవిందకు ఇద్దరు తమ్ముళ్ళు, ఒక చెల్లెలు. ఆమెతండ్రి సర్కిల్ ఇన్స్పెక్టరు. మనిషి గంభీరంగా కనిపించినా "ఏమిటండీ మరీ చిన్న పిల్లాడిలా అలా కుమిలిపోతే ఎలా? మగవారు, చదువుకున్నవారు, నలుగురికిపాఠాలు చెపుతున్న వారూను. కాస్త నిబ్బరం అలవర్చుకోవాలి. అమ్మాయి చెపుతుంటుంది మీగురించి. అవును గాని మీకు చదరంగం ఆడడంవచ్చా? రెండెత్తులు వేసుకుందాం .." వాతావరణాన్ని తేలికపరచే ప్రయత్నం. "బాగుందండీ మీరూ మీ చదరంగమూనూ. పుట్టెడు దుఃఖంతో వున్న అబ్బాయిని పట్టుకొని చదరంగంవచ్చా, చట్టుబండలువచ్చా అంటారేమిటి. అన్నీ పోలీసు బుద్ధులే. ఆయనగారితో ఏమిటిగాని లే నాయనా! లేచి కాళ్ళుకడుక్కో, కాసిని మెతుకులు కతుకుదువుగాని" అరవింద తల్లి ఆపేక్ష.

అరవింద నా పట్లచూపే శ్రద్ధ అమ్మను గుర్తుకుతెస్తోంది. ఏ అరమరికా లేకుండా నేను వాళ్ళింట్లో మసలడం, నా ఇంటికి అరవింద తరచురావడం మా ఇద్దరిమధ్య సన్నిహితాన్ని చిక్కబరిచింది. దగ్గరుండి ఆమె నా యింటిని సర్దించడం, వంటవాడిచేత నా కిష్టమయినవి వండించడం—అరవింద నా ఇంట్లో మనిషిలా తయారయింది. అమ్మ చనిపోయాకకూడా నాకు మేలుకలిగేట్టు చూస్తోంది అన్నదే నా భావన. అరవింద నాకిచ్చే కంపెనీ, ఆమె నా యందు చూపించే అభిమానం .... నెమ్మదిగా అరవింద నన్ను ఆక్రమించుకొంటోంది. ఆమె నాది అన్న భావం నాలో నిండుకొంటోంది. ఒక్కపూట అరవింద కనిపించకపోతే విలవిలలాడిపోయే స్థితికివచ్చాను. లోకం గుడ్డిదికాదు. చెవిటిది అసలేకాదు....మా ఇద్దరి గురించిన కథలు కాలేజీలో కావ్యాలై వెలిశాయి....గుసగుసలు .... మమ్మల్ని చూడగానే చెవులు ముక్కలు ముక్కలుగా తెగిపడుతున్నాయి.

"ప్రవరాఖ్యులు ప్రపంచంలో పడ్డారే!" నా ఎదురుగానే హాస్యం చేసేవారు. నాకు చాలా ఆనందంగావుంది. "పార్టీ ఎప్పుడు సార్?" చిరునవ్వు సమాధానం.

"ఇలా ఎన్నాళ్ళు? మావాళ్ళు తొందరపడుతున్నారు. ఆ మూడుముళ్ళు పడ్డాక మీఇష్టం. ఎలాగయినా తిరగండి అంటోంది అమ్మ." అరవింద ముద్దుగా గునిసింది.


నాకు ఏనుగెక్కినంత సంతోషం. "నా ఆలస్యం ఏంలేదు అరవిందా! నేనూ ఆ క్షణం కోసమే ఎదురుచూస్తున్నాను. ఆలస్యం అంతా మీ వాళ్ళదే!'' ఈ శూన్యమాసం తర్వాత ముహూర్తాలు వున్నాయట.

* * *

అమ్మపోయిన దగ్గరనుండి ఇరుగు పొరుగు వారితో కష్టమయిపోయింది. వాళ్ళ కళ్ళకు నేనొక విచిత్రవ్యక్తిని. వాళ్ళదృష్టిలో పిచ్చివాణ్ని. "నీ వరస మాకేం నచ్చలేదు. పెళ్ళవకుండా ఆ అమ్మాయితో బలాదూరుగా ఆ తిరుగుళ్ళు బాగాలేవు. మావీ సంసారుల కొంపలే! మా ఇళ్ళలోనూ వయసుకొచ్చిన అమ్మాయిలున్నారు. ఆ అమ్మాయిల విషయం ఆలోచించి కనీసం, ఆ శుభకార్యం త్వరగా జరగనీ.'' ఒక ముసలాయన పనిగట్టుకుని వచ్చి మరీ బోధించాడు. అంతా అసూయ. అరవిందతో తిరుగుతున్నానన్నది ఆరోపణ. ఇంత ఆస్తికి వారసుడు తమకు దక్కకుండా పోయాడన్న బాధ. అరవింద నా భార్యగా యెంత త్వరగా నా ఇంటికివస్తే అంత మంచిది. అప్పటికిగాని వీళ్ళనోళ్ళు మూతలు పడవు.

"అమ్మపోయిన విచారం నీకుండటం సహజమే, కాదనను. కాని రాత్రులు ఆ యేడుపు యేమటి? అర్ధరాత్రిదాటాక డాబా పిట్టగోడమీద కూర్చుని 'అమ్మా' అని నీవు పెద్దగా రాగాలు పెడుతూంటే, చిన్నపిల్లల సంగతి అటుంచి, ఇళ్ళలో ఆడవాళ్లు సహితం భయపడుతున్నారు" ఇంకొక ఆయన ఫిర్యాదు.

అమ్మను మరచిపోలేక నేను విచారిస్తున్న నంగతి వాస్తవమే. పగలంతా కాలేజీ....అర




వింద....ఆదమరచి వుంటున్నానేమోగాని, రాత్రి ఇంటిదగ్గర వంటరితనంలో అమ్మ జ్ఞాపకాలు నన్ను చుట్టుముడతాయి. అయితే వీళ్ళందరికీ వినిపించేటట్టు పెడబొబ్బలు పెడుతున్నానా? అర్థరాత్రులు పిట్టగోడమీద కూర్చుని శోకాలు తీస్తున్నానా....అంతా అబద్ధం.

"రాత్రి మీరు బయటకు వెళ్ళాలంటే నన్ను లేపి వుండవలసింది అబ్బాయిగారూ. మీరు బయట గొళ్ళెంపెట్టి వెళ్ళిపోయారు. ఇంట్లో ఎవరు చొరబడినా ముసలి ముండావాణ్ని, ఏం అడ్డుకుంటాను? నన్ను లేపితే తలుపు వేసుకునేవాణ్నికదా?" వంటవాడి ఫిర్యాదుతో నాకు మతిపోయింది. నన్ను నేను అదుపులోకి తెచ్చుకునే సరికి వాడు మొదలెట్టాడు మళ్ళీ.

"అయినా అమ్మగారు పోయిందగ్గర్నుంచి మీకు అర్థరాత్రి షికార్లు ఎక్కువయాయి. ఆయమ్మ వున్నంతకాలం, సాయంత్రం అయేసరికి మీరు గూడు చేరుకునేవారు. ఉదయం వరకూ గువ్వపిట్టలా పడుకునేవారు. మీకు చెప్పవలసినంత వాడిని కాదుగాని మనంహద్దులు దాటిపోతే నలుగురిలోనూ మాటపడిపోతాం."

వంటవాడి నసతో నాకు చిరాకెక్కువైంది. నా చిన్నతనం నుండే మా యింటిని అంటిపెట్టుకున్నాడు....కాస్త చనువెక్కువయింది. అయినా వీడికేం వచ్చిందితెగులు? అర్థరాత్రులు నేను బయటకు షికార్లకెడుతున్నానంటున్నాడు. వెళితేమటుకు, వాణ్ని లేపకుండా, తలుపులు వేసుకోమనకుండా నేను బయటకు వెళుతూ వున్నానా? వాడిచ్చిన కాఫీ విషంలా వుంది.

వాడు చెప్పిందంతా మననం చేసుకుంటే దడపుట్టింది. ఎక్కడికెళుతున్నాను? అర్ధరాత్రులు ఏం చేస్తున్నాను? అమ్మపోయిన తర్వాత వంటవాడు త్రాగుడు మొదలెట్టాడా? వంటిమీద స్మారకముంటోందా వీడికి! పీడ కలలుగాని వస్తున్నాయేమో!, లేవగానే వెధవసోదీ వీడూను. కాఫీ చప్పగా చల్లారిపోయింది.

లేచి నిలుచున్నాను. కాళ్ళకు బూట్లున్నాయి. వంటిమీద ట్రౌజరూ, షర్టూను! రాత్రులు లుంగీతో పడుకోవడం అలవాటు నాకు. మరి యిదేమిటి? ఆమధ్య ఒకసారి ఇలాగే జరిగితే నిద్రమత్తులో బట్టలు మార్చుకోలేదని సరిపుచ్చుకున్నాను. ఇంకొకసారి సగం వ్రాసిన వ్యాసం ఉదయం పూర్తిచెయ్యొచ్చులే అని ఆపేసి నిద్రపోయాను. ఉదయం చూసేసరికి వ్యాసంపూర్తి చేసి వుంది. దస్తూరి నాదే! పొరపాటు పడ్డాననుకున్నా నప్పుడు.

ఈనాడు జరిగిందేమిటి? చుట్టుపక్కలవారి ఆరోపణలకు అర్థం ఏమిటి? వంటవాడి ఫిర్యా

దుకు సమాధానం ఏమిటి? నేనెక్కడకు వెళ్తున్నాను? అసలు అలా తిరుగుతున్నానని నాకు వాళ్ళూ వీళ్ళూ చెప్పడం ఏమిటి? అంటే నాకుతెలియకుండానే ఇల్లువిడిచి అర్థరాత్రులు తిరుగుతున్నానా! మస్తిష్కంలో డయినమైటు ప్రేలింది!

ఏదో అవుతోంది. ఏమిటీ మార్పు నాలో! మెదడంతా పొగమంచు క్రమ్ముకుంటోంది. నాకు తెలియని ఇనుపతెఱ అడ్డుపడుతోంది. ఇదమిద్ధమని తెలియని పరిస్థితి. నావి అనుకున్న శాంతి, సుఖం దూరం అవుతున్నాయి. ఈమార్పుకు కారణం తెలుసుకుని, దాని అంతు చూడాలి. ఇలా ఆలోచిస్తూవుంటే సాలెగూడు చిక్కబడిపోతుంది....అందుకే గామోసు కాలేజీలోకూడా వాతావరణం మార్పు చెందింది ... నేను మొదట్లో గుర్తించలేక పోయాను. కొందరు నా వేపుచూసిన చూపుల్లో తెలియని భావాలు... కొందరు నన్ను వింతమృగాన్ని చూసినట్టు, దగ్గరకు వస్తే మింగేస్తానేమో అన్నంత భయంతో దూరదూరంగా తప్పుకు తిరుగుతున్నారు.

ఒకనాడు స్టాఫ్‌రూంలో సింకు దగ్గర ముఖం కడుక్కుంటున్నా. "అదొక సైకలాజికల్ కేసు గురువుగారూ! అందుకే అతని తల్లి లోకానికి తెలియకుండా జాగ్రత్తపడి, అతన్ని ఇంటి దగ్గరేవుంచి కాపలా కాసేది.'' ఆచారి ఇంకొక మాష్టారికి చెబుతున్నాడు. ఎవరి గురించి అనుకుంటూ వెనక్కు తిరిగేసరికి, హటాత్తుగా నన్నుచూసి వాళ్ళు బిత్తరపోయి అక్కడనుండి జారుకున్నారు. అయితే ఆనాడు వాళ్ళు మాటాడుకున్నది నా గురించేనన్నమాట!

అరవింద నా ఇంటికివచ్చి వారం రోజులు అయింది. ఏవో కుంటిసాకులు చెపుతూనేవుంది. వాళ్ళింట్లో వాతావరణంలో మార్పు కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. ఏదో సంశయం. ఏదో సందేహం! వాతావరణం నిండా ప్రశ్నార్థకాలే! అయితే అరవిందకుకూడా నా గురించి, నాకు తెలియని సత్యం తెలుసునన్న మాట.

నిజంగా నేను విచిత్ర వ్యక్తినా? ఎవరికీ అర్థం కాని జటిల సమస్యనా! ఏమవుతోంది నాకు? ఈ పొగమంచు ఇక విడదా? ఈ ఇనుపతెఱ అడ్డం తొలగదా!

ద్రావిడ ప్రాణాయామమయింది జీవితం!

ఆ రోజు సాయంత్రం అరవింద ఇంటివైపు బయలుదేరాను. అరవిందను అడగాలి. నా గురించి ఆమె సహకారంతో నా సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఇది నా ఆశ.

రోడ్డుమీద ఎదురయింది అరవింద...... ముఖంలో నాకు తెలియని భావాలు కనిపించాయి. అది కోపమో, బాధో, ఆందోళనో తెలియలేదు.

"నిన్న రాత్రి ఏ సినీమాకు వెళ్ళారు?" పిడుగు పేల్చింది అరవింద.

"సినీమాకా? నిన్నరాత్రా? లేదే! రాత్రంతా ఇంటి దగ్గరే వున్నాను."

నేను సినీమాకు వెళ్ళలేదని నాకు తెలుసు. గాని నేనిచ్చిన సమాధానంలో పటుత్వం లేదన్న విషయం నాకే తెలిసి పోయింది.

"ఎక్కడికీ వెళ్ళలేదా?" రెట్టించి అడుగుతోంది.


"లేదు అరవిందా. ఎక్కడికీ వెళ్ళలేదు. వెళితే నీ దగ్గిర దాపరికం ఏమిటి?"

సాధ్యమైనంత నిబ్బరంతో సమాధానం ఇచ్చాను. అయినా లోపల అనుమానం పీకుతోంది. నిన్నరాత్రి ఎక్కడకు వెళ్ళాను? ఎందుకు వెళ్లాను!

"అలా అనుకునే ఇన్నాళ్లూ మోసపోయాను." జేవురించిన ముఖంతో అరవింద. ఆమె కళ్ళలో నీటి పొరలు.........ముక్కుపుటాలు ఎగురుడు.

"నిన్నరాత్రి రెండు గంటలకు మీరు బీచ్ రోడ్లో ఏం చేసారు? పెట్రోల్ స్క్వాడ్‌లో వున్న వెంకట్రావుగారికి మీరు తెలుసు. ఇంట్లో అపుడప్పుడు మిమ్మల్ని చూడ్డం మూలాన వదిలేసారు.ఆయనే ఇవాళ మానాన్నగారికిచెప్పారు.

"ఇప్పుడుచెప్పండి. అంత రాత్రివేళ బీచ్‌లో మీకేం పని? ఇంకా దబాయిద్దామనే అనుకుంటున్నారా! రాత్రి ఇంటి దగ్గరే వున్నానని నన్ను నమ్మిద్దామనే అనుకుంటున్నారా!"ఉక్రో




షంతో కంఠం జీరపోయింది. పూనకం వచ్చిన దానిలా వూగిపోతోంది అరవింద.

నాలో నిస్సత్తువ, నీరసం చోటుచేసు న్నాయి.

ఉదయం జరిగింది గుర్తుకు వచ్చింది. స్స విప్పుతున్నప్పుడు కాళ్ళకున్న ఇసుక కంటబడింది. మరి నేను బీచికెందుకెళ్ళాను? పరిష్కారం కాని సమస్య.

"అయితే అందరూ అనుకుంటున్నది నిజమే న్నమాట. నేనే నమ్మలేదు. నాన్నగారు కూడ ్నరు. అటువంటివి జరుగుతుంటాయని... ." స్వగతాన్ని బయట పెడుతోంది అరవింద.

"ఏమిటా అంతా అనుకునేది? ఏమిటా నిజం! చెప్పు అరవిందా" అడిగాననే కంటె అరచాననే చెప్పాలి.

అదిరిపోయింది అరవింద. బెదరిపోయింది. ఎవరయినా వింటున్నారేమో అన్నట్టు చుట్టూ చూసింది. ఒకరిద్దరు కుతూహలంగా నిల్చున్నారు.

సిగ్గుతో చితికి పోయింది అరవింద. బెదిరే కళ్ళతో నావైపుచూసి "చూడండీ! ఇహ మీరు మా ఇంటికి రాకండి. నేను మీ ఇంటికి రాను. ఇకమీదట నన్ను కలియడానికిగాని, నాతో మాట్లాడడానికిగాని ప్రయత్నించకండి. ప్లీజ్. శలవ్" కళ్ళనుండి ఉబికే నీటిని ఆపే వృధా ప్రయత్నంచేస్తూ గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది అరవింద.

పగిలే తలతో యిల్లు చేరాను. కిటికీలోనుండి బయటకు చూస్తే, ఆకాశంలో సూర్యుణ్ని ఎవరో మర్డర్ చేశారు. ఆ వార్తను దిగాంతాలకు మోస్తోంది గాలి. అరవింద నాకు దూరమయింది. ఆప్యాయత, అభిమానం, అనురాగం అన్నీ దూరమయాయి. కన్న కలలన్నీ కరగిపోయాయి.

"అందరూ అనుకుంటున్నది నిజమే నన్న మాట"

అరవింద పలుకులు ములుకుల్లా వేధిస్తున్నాయి. కణతలు బ్రద్దలవుతున్నాయి. బుర్రలో రైళ్ళు ఢీకొన్న ఆందోళన! నాకు పిచ్చిగాని ఎక్కడు కదా! అమ్మలేని నాకు అన్నివిధాల అమ్మకు సాటి అనుకున్న అరవింద కూడ దూరమవుతుందా! తల బల్లకేసి కొట్టుకున్నాను. తిమ్మిరెక్కినట్టయింది.

ఎదురుగా అద్దంలో నా ప్రతిబింబం! నాకే భయం వేస్తోంది.

కళ్ళ చుట్టూ ఆ ముడతలేమిటి? ఆ నల్లని వర్తులాకారపు చారలేమిటి? పీక్కుపోయిన ఆ ముఖం ఎవరిది? గుంటలు కట్టిన ఆ కళ్ళు. గాజు గుళ్ళలాటి ఆ కళ్ళు....కళ్ళలోని ఆ కళ ... ప్రేతకళ....అవును అది ప్రేతకళే!

ఎవరికి చెప్పుకోగలను నాలోని బాధ! ఎవరున్నారు నాకు! చుట్టూవున్న ప్రపంచం వేధించుకు తింటోంది. లోనవున్న మెదడు కాల్చుకు తింటోంది. నాదీ అనుకున్న అరవింద అందకుండా పోయింది. ఇంకెవరున్నారు నాకు? ఎవరూలేరు! వంటరితనంలో నాకీ శిక్షేమిటి?

"నేను లేనట్రా కన్నా!" అమ్మ ఆప్యాయంగా పలికిందన్న భావన. ..ఆ భావన .. . అదొకటే నాకు సాంత్వన.

* * *

టేబిల్‌గ్లాసు టాప్‌మీద ఒక నల్లని కండచీమ నడుస్తోంది . రాణీలాగ. ..ఠీవిగా, పొగరుగా నడుస్తోంది ...రాచరికం ఉట్టిపడుతోంది. వయ్యారం ఒలకబోస్తూ నడుస్తోంది. ఎంత పొగరు! సిగరెట్టు వెలిగించి రెండు దమ్ములు గట్టిగా లాగాను . .. సిగరెట్టు చివరకాలి నుసి కట్టింది. నుసి దులిపాను. ఎర్రగా కాల్తోంది సిగరెట్టు. నెమ్మదిగా కండచీమ వెనుకకాళ్ళ కంటించాను .రెడ్‌సిగ్నల్! డేంజర్! అపాయం! పారిపో! ఎవరో తరిమినట్టు, ఒక్కసారి సంచలనంపుట్టి పారిపోతోంది చీమ. .. ఎంతదూరం పోతుంది. .కథల్లో చదివిన రాక్షసుడి చేతిలోని రాజకుమార్తె గుర్తుకువచ్చింది. చిన్నగా నవ్వుకున్నాను. రెండవసారి దమ్ము లాగాను. ఈసారి సిగరెట్టును ముందరికాళ్ళకు అంటించాను .. . రాణీగారు కుంటుపడింది.... సోయగంపోయింది ...ఠీవి పోయింది....కాస్సేపట్లో సొమ్మసిల్లుతుంది. రెండు కాళ్ళనూ నాకే ప్రయత్నం చేస్తోంది. కొంచెం సేపటికి వెనుకకాళ్ళు కాస్తస్వాధీనానికివచ్చినట్టున్నాయి. నడక ..పరుగు....నడకలాటి పరుగు....ఇంకా ఒక్కదమ్ము లాగాను. నుసి దులిపాను. కణకణలాడుతోంది అగ్గి. మొత్తం శరీరానికి అంటించాను. అంతే! రామంది. మరి చలనం లేదు.

ఇంతలో ఎక్కడనుంచి వచ్చిందో మరొక చీమ వచ్చింది. దాని నడకలో తొందర, వేగం. దాని పనీ పట్టించాను. ఇంక చీమలురాలేదు. ఇంకొక సిగరెట్టుతీసి దమ్ము తృప్తిగాలాగాను.

కాని నాకు తెలుసు. ఈరెండు శవాలను మోసుకు పోయేందుకు ఎర్రచీమల దండు వస్తుంది ..ఉదయం అయేలోపల ఆ రెండు శవాలు మాయమవుతాయి.

* * *

చురుక్కుని ఎండ తగిలేసరికి లేచాను. డాబామీద దుమ్ములో పడుకొని వున్నాను. వంటిమీద బట్టలు మార్చుకోలేదు. కాళ్ళకు షూస్, సాక్సువున్నాయి. రాత్రి క్రింద గదిలో పడుకున్నంతవరకూ నాకు తెలుసు. మరిక్కడకెలా తేలానో!

అయితే అందరూ అనుకుంటున్నది నిజమే నన్నమాట!

క్రింద ఎవరో తలుపులు బాదుతున్నారు. తీయకపోతే విరగ్గొట్టేట్టున్నారు. అయినా ఈ వంటవాడిని మార్చేయాలి. ఒక్కరోజు శలవని వెళ్ళి రెండురోజులయింది. వాడికీ విసుగూ, చీకాకూ ఎక్కువవుతున్నాయి. వీడిని మార్చేయాలి. గబగబ క్రిందకు దిగి తలుపుతీశాను.

"యు ఆర్ అండర్ అరెస్ట్" పోలీసు ఇన్స్పెక్టరూ, జవాన్లు.

"ఏం! ఎందుకూ?" టెంకాయ పిచ్చికొండ నయాను.

"అరవిందను హత్యచేసిన నేరానికి....యీ మనీపర్సూ .... డైరీ మీవేనా? నిన్నరాత్రి ఎక్కడున్నారు?'' ఏవేవో ప్రశ్నలు.

ఆ పర్సు నాదే! ఆడైరీ....అవును అదీ నాదే! మరి అరవింద? అరవిందకూడా నాదే, మరినేను? నేను....నేను అమ్మ సొత్తు.... ఇనుపతెఱ మంచుపొర అలాగేవున్నాయి. □